క్లుప్తంగా

మెనూ ప్రకారం భోజనం వడ్డించండి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీడీఓ జ్యోతి

కమలాపురం : ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. బుధవారం ఆమె మండలంలోని పెద్దచెప్పలిలో అంగన్‌వాడీ సెంటర్, ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు ప్రతి రోజు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం వడ్డించాలన్నారు. అనంతరం సచివాలయంను సందర్శించారు. సిబ్బందికి సలహాలు, సూచనలు అందజేశారు. ఈఓపీఆర్‌డీ శారదారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నబీషాఖాద్రీ గంధోత్సవం

జమ్మలమడుగు : పెన్నానది సమీపంలో ఉన్న నబీషాఖాద్రీ గంధోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్‌షా సాదిక్‌పాషా ఖాద్రీ, సయ్యద్‌షా అసద్‌పాషాఖాద్రీల ఆధ్వర్యంలో పకీర్ల మేళా తాళాలతో ఊరేగింపుచేశారు. సఫర్ నెల చివరి బుధవారం కావడంతో ముస్లింలో కుటుంబ సభ్యులతో విహార యాత్రకు పెన్నానదిలో గడిపారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పాడి రైతులకు బహుమతులు అందజేస్తాం



పాడిరైతులకు చెక్కును అందజేస్తున్న రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ రవీంద్రారెడ్డి

తొండూరు : మల్లేల పాలసేకరణ కేంద్రంలో ఎక్కువ పాలు పోసే పాడి రైతులకు బహుమతులు అందజేస్తామని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ రవీంద్రారెడ్డి తెలిపారు. బుధవారం మల్లేల గ్రామంలో వెలుగు అధికారులతో కలిసి ఆయన పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 8 మంది పాడి రైతులకు సంబంధించి రూ.4 లక్షలు మొత్తాన్ని అందజేశారు. అమూల్ పాలసేకరణ కేంద్రానికి వచ్చే ఏడాది మార్చి నాటికి ఎవరైతే ఎక్కువ పాలు పోస్తారో ఆ పాడి రైతులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను తన సొంత నిధులతో అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విష్ణు, ఏపీఎం వెంకటనారాయణ, వీఓఏ, సభ్యురాలు తదితరులు పాల్గొన్నారు.

'చేసిన పాపం ఊరికే పోదు'



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సింహాద్రిపురం : చంద్రబాబునాయుడు చేసిన పాపం ఊరికే పోదని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, అరవిందనాథరెడ్డిలు ధ్వజమెత్తారు. బుధవా రం బిదినంచెర్లలోని ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి ఘనంగా ని వాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడు తూ ఎన్టీఆర్ కాంగ్రెస్‌లో ఉన్న చంద్రబాబును టీడీపీలోకి తెచ్చుకుని తన అల్లుడిగా చేసుకుంటే చంద్రబాబు తాను సీఎం కావాలని పచ్చ మీడియా రామోజీరావుతో కలిసి కుట్రలతో టీడీపీ పార్టీని వారి ఆధీనంలోకి తీసుకుని మామకు నమ్మకద్రోహం చేశాడన్నారు. స్వలాభం కోసం రూ.కోట్లు ఘడించి 100 తప్పు లు చేసిన శిశుపాలుడిలాగా సీబీఐకి దొరికిపోయా డన్నారు. దీంతో ఎన్టీఆర్ ఆత్మకు శాంతి చేకూరిందన్నారు.

రక్తదానం చేయండి

వేంపల్లె : ఎలాంటి అపోహలు లేకుండా ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు స్వాతిసాయి తెలిపారు. బుధవారం స్థానిక 7వ సచివాలయంలో ఆయుష్మాన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. అర్హులైన కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా వారికి అవసరమైన నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఆయుష్మాన్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన్ (పీఎంజేఏవై) పథకం కింద లబ్ధిదారునికి నగదు రహిత, పేపర్‌లైన్ సేవలు అందిస్తున్నట్లు వివరించారు.

పింఛన్ల పంపిణీ

వీరపునాయునిపల్లె : ఎన్.పాలగిరి సచివాలయ పరిధిలో నూతనంగా మంజూరైన పింఛన్‌లను బుధవారం రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్, జేసీఎస్ కన్వీనర్ లింగారెడ్డి వీరప్రతాప్‌రెడ్డి పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అర్హు లైన వారందరికి అందించాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. పంచా యతీ కార్యదర్శి నాసరయ్య మాట్లాడుతూ సచివాలయ పరిధిలో మొత్తం 26 కొత్త పింఛన్‌లు మంజూరు కాగా వీటిలో వికలాంగులకు 16, వితంతువులకు 1, వృద్ధాప్య పింఛన్‌లు 9 మంజూరయ్యాయన్నారు. మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, సచివాలయ కన్వీనర్ నాగమునిరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేముల : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. స్థానిక గుట్టపై ఉన్న కల్యాణ మండపంలో బుధవారం వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, జడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డి, మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి, పీసీబీ డైరెక్టర్ మరక శివకృష్ణారెడ్డిలతో కలిసి ప్రజల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని, అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. సమస్యలున్నట్‌లెతై తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. అనంతరం మండలంలోని 16 పంచాయతీలకు చెందిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వారి నుంచి వినతులను స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి పరిష్కారం చూపారు. మరికొన్నింటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు. అర్హులుగా ఉండి సంక్షేమ పథకాలు అందనివారు ఉండకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం అన్ని అవకాశాలను కల్పిస్తోందన్నారు. ప్రభుత్వం అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని పథకాలను పొందాలన్నారు. అర్హులుగా ఉండి ఇళ్లు రానివారికి వెంటనే పక్కా గృహం మంజూరు చేయాలని సూచించారు. గతంలో పక్కా గృహాలు మంజూరై ఇళ్లు నిర్మించుకోని వారు చౌడు మిద్దెలు ఉన్నట్‌లెతై స్లాబ్ వేసుకునేందుకు రూ.40వేలు మంజూరు చేస్తామన్నారు. అలాగే గతంలో ఇంటికి కొంత బిల్లు వచ్చి నిల్చిపోయి ఉన్నట్‌లెతై వారికి పక్కా గృహం మంజూరు చేసి, మంజూరైన బిల్లు పోనూ మిగితా బిల్లును చెల్లిస్తామని సూచించారు. మండల వ్యాప్తంగా పనులు పూర్తి దశకు చేరుకుని ఏవైనా మిగిలిన పనులు ఉంటే అటువంటి వాటిపై దృష్టి సారించి పూర్తి అయ్యేలా చూడాలన్నారు. కొంతమంది డీకేటీ భూములు కావాలని కోరడంతో మండల కేంద్రానికి 5 కిలో మీటర్ల పరిధిలో డీకేటీ పట్టాలు ఇచ్చేందుకు వీలులేదని.. ఎవరైనా భూములు సాగు చేసుకుంటున్నట్‌లెతై వాటిని సాగు చేసుకోవచ్చని, ఆ భూములపై ఎలాంటి హక్కు పత్రాలు ఇచ్చేందుకు అవకాశం లేదని తెలిపారు. గ్రామాల్లోని వీధులలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు, వేములలోని ఇందిరమ్మ కాలనీలో జనవాసంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటికి మార్చాలని కోరడంతో వెంటనే ఆయన ట్రాన్స్‌కో ఏడీ శ్రీకాంత్‌కు సమస్యను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ఈ ఏడాది పత్తి పంటకు వాతావరణ బీమా కింద చేర్చడంతో పంట నష్టపోయిన ఆశించిన స్థాయిలో బీమా రాదని, పత్తి పంటను పసల్ బీమాలోకి మార్చేలా చూడాలని రైతులు అభ్యర్థించారు. దీంతో ఆయన వెంటనే అగ్రికల్చర్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అలాగే యురేనియం ప్రాజెక్టు కింద భూములు కోల్పోయామని, ఉద్యోగాలు రాలేదని, నాల్గవ రీచ్‌లో భూములు తీసుకున్నారని, పరిహారం, ఉద్యోగాలు ఇవ్వలేదని ఆయనకు విన్నవించారు. దీంతో ఆయన నాలుగవ రీచ్ భూములకు సంబంధించి సమస్య అక్టోబర్ నాటికి కొలిక్కి వస్తుందని, అంతవరకు ఓపిక పట్టాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రాజారెడ్డి, సచివాలయ కన్వీనర్ రవీంద్రారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, తహసీల్దార్ వెంకటసుబ్బయ్య, ఏఓ చెన్నారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివారెడ్డి, అన్ని పంచాయతీలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేంపల్లె : రాజీవ్‌నగర్ కాలనీ పరిధి జగనన్న హౌసింగ్ కాలనీలో కొత్త విద్యుత్ లైన్ ఏర్పాటు కోసం గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ జేఈ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. పట్టణంలోని సాయినగర్, లయన్స్ నగర్, రాజాతోట, తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

16న మండల సర్వసభ్య సమావేశం

వేంపల్లె : ఈనెల 16వ తేదీన వేంపల్లె మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి తెలిపారు. వైద్యం, విద్య, ఆరోగ్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, వ్యవసాయం, విద్యుత్, పౌరసరఫరా, స్త్రీశిశు సంక్షేమం, ఉపాధిహామీ, గృహనిర్మాణం, వెలుగు, రోడ్లు భవనాలు, ఉద్యానవన తదితర శాఖలకు సంబంధించిన అంశాలపై సమీక్ష ఏర్పాటు చేశామన్నారు. ప్రజాప్రతినిధులు, ఆయాశాఖల అధికారులు పూర్తి సమాచారంతో ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శిక్షణ

తొండూరు : పులివెందుల ప్రాంత వాటర్‌షెడ్ రైతుల ప్రయోజనార్థం కృషివిజ్ఞాన కేంద్రం, ఊటుకూరు, కడప జిల్లా నీటియాజమాన్య సంస్థ సంయుక్తంగా 7 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా రెండవ రోజు బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శశికాంత్‌రెడ్డిలు పాల్గొని మాట్లాడారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై 7 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని నూతన సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు పొందాలన్నారు. కృషివిజ్ఞాన కేంద్రం, ఊటుకూరు, సాంఘికశాస్త్రం విభాగపు శాస్త్రవేత్త ఎస్.ప్రశాంతి మాట్లాడుతూ చిరుధాన్యాల యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. ఏరువాక కేంద్రం విస్తరణ శాస్త్రవేత్త ఎస్.రామలక్ష్మిదేవి సమీకృత వ్యవసాయం యొక్క ఆవశ్యకత, వివిధ పద్ధతుల గురించి వివరించారు. అరటి పరిశోధన స్థానం, పులివెందుల ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి సుశీల అరటికాయలు, గెలలు, ఎరువుల యాజమాన్యం, ఇతర యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో పులివెందుల వాటర్‌షెడ్ ప్రాజెక్టు ఆఫీసర్ రఘునాథరెడ్డి, పులివెందుల సీఎల్ఆర్సీ కోర్సు డైరెక్టర్ హరి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వాటర్‌షెడ్ ప్రాజెక్టు సిబ్బంది, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



లింగాల : వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏడీఏలు అనిత, అశోక్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : ప్రస్తుతం సాగులో ఉన్న పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని పాయసంపల్లె, అలిదెన, ఇందుకూరు గ్రామాల్లో సాగులో ఉన్న పత్తి పంటను పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం పత్తి పంటలో రసం పీల్చే పురుగులకు అనుకూలమైన వాతావరణంతోపాటు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. దీనివలన మొక్క గిడసబారి దిగుబడిపై ఎక్కువ ప్రభావం చూపుతుందన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి రైతు భరోసా కొరకు కొత్త రైతులు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. సొంత భూమి ఉండి ఇదివరకు రైతు భరోసా మంజూరు కాని వారు, కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు చేయించుకున్న రైతులు రైతు భరోసా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఖరీఫ్‌కు సంబంధించి పంట నమోదు కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

పంట నమోదైన పొలాల తనిఖీ

లింగాల : మండలంలోని పెద్దకుడాల గ్రామంలో ఇప్పటివరకు జరిగిన పంట నమోదు వివరాలను సక్రమంగా జరిగిందా, లేదా అనే విషయమై భూసంరక్షణ విభాగ ఏడీఏ అనిత, పులివెందుల ఏడీఏ అశోక్‌రెడ్డిలు మండల వ్యవసాయ అధికారి రమేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పెద్దకుడాల పొలంలోని పి.రమణమ్మ చీనీతోటలో సాగుచేసిన వేరుశెనగ అంతర్‌పంటను, బలిరెడ్డి అనే రైతు సాగుచేసిన చీనీలో ప్రొద్దుతిరుగుడు పంటను తనిఖీ చేశారు. ఏడీఏ మాట్లాడుతూ ఖరీఫ్ 2023కి సంబంధించి పంట నమోదు త్వరితగతిన పూర్తిచేయాలని కోరగా ఆర్బీకే సిబ్బంది ఈక్రాప్ బుకింగ్ గడువు పెంచాలని ఏడీఏకి విజ్ఞప్తి చేశారు. ఖరీఫ్‌లో సాగులో ఉన్న ప్రతి పంట ఈక్రాప్ బుకింగ్‌లో నమోదు కావాలని సిబ్బందికి సూచించారు. ఈ క్రాప్ బుకింగ్ డేటా ఆధారంగానే పంటల బీమా, పంట నష్టపరిహారం, సున్నావడ్డీ పంటరుణాలు వంటి రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలవుతాయన్నారు. పంటసాగు చేసిన రైతులందరు తప్పనిసరిగా మీ గ్రామ రైతు భరోసా కేంద్ర సిబ్బందిని సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతుభరోసా కేంద్రం సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

వేంపల్లె : వినాయక చవితి పండుగ సందర్భంగా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి అని వేంపల్లె ఎస్ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు. అందుకు సంబంధించి 5 మందితో ఒక కమిటీ ఏర్పాటు చేసుకుని అన్ని జాగ్రత్తలు చేపట్టాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, కమిటీ సభ్యులు అన్ని అనుమతులు పొందాలన్నారు. అలాగే కమిటీ సభ్యులు బాధ్యత వహిస్తూ ఎలాంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుని, నిబంధనలు పాటించాలని వెల్లడించారు.


చక్రాయపేట..

చక్రాయపేట : వినాయకచవితి పండుగ సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలనుకున్న వారు పోలీసుల అనుమతిని తప్పని సరిగా తీసుకోవాలని ఆర్కేవ్యాలీ సీఐ గోవిందరెడ్డి తెలిపారు. చక్రాయపేట, వేముల, ఆర్కేవ్యాలీ పోలీసుస్టేషన్‌ల పరిధిలో ఉన్న గ్రామాలకు చెందిన వారు ముందుగా ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసుకుని పోలీసు స్టేషన్ వద్దకు వెళ్లి అర్జీ రూపంలో ఫోన్ నెంబర్లు నమోదు చేసి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. తమ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తాము బాధ్యత వహిస్తామని చెబుతూ నిమజ్జనం ఎక్కడ చేసేవిషయం కూడా అందులో పొందుపరచాలన్నారు.

కమలాపురం..

కమలాపురం : మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసే వినాయక విగ్రహాలకు అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. అలాగే విగ్రహం ఎత్తు 10 అడుగులకు మించరాదన్నారు. విగ్రహం ఏర్పాటు చేసిన చోట 24 గంటలు కమిటీ సభ్యుల్లో ఒకరు కచ్చితంగా ఉండి పర్యవేక్షించాలన్నారు. అలాగే నిమజ్జనం రోజున ఇన్సూరెన్స్ ఉన్న ట్రాక్టర్‌నే వినియోగించాలని, డ్రైవర్‌కు లైసెన్స్ ఉండటంతో పాటు మద్యం ఎటువంటి పరిస్థితిలో తీసుకోకుండా ఉండాలన్నారు. విగ్రహాన్ని నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే నిమజ్జనం చేయాలన్నారు.

రక్తపరీక్షల కిట్లు సరఫరా



రక్తపరీక్షల కిట్లను సరఫరా చేస్తున్న అధికారి సిద్ధయ్య

పులివెందుల రూరల్ : జిల్లా మలేరియా అధికారి మనోరమ ఆదేశాల మేరకు పులివెందుల సబ్‌యూనిట్ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రక్తపరీక్షల కిట్లను, తదితరవాటిని సరఫరా చేశామని బుధవారం మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్ధయ్య తెలిపారు. తాళ్లపల్లె, వేముల, నల్లపురెడ్డిపల్లె, లింగాల, బిదినంచెర్ల, సింహాద్రిపురం, కోవరంగుట్టపల్లె, తొండూరు, సంతకొవ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, నగరిగుట్ట, భాకరాపురం, పులివెందుల అర్బన్ హెల్త్ సెంటర్లకు దోమల నివారణకు సైపనోత్రిన్, లార్వా నివారణ కొరకు అబేట్, బి.టి.ఐ. జ్వరాలు వచ్చిన వారికి మలేరియా రక్త పరీక్షలు చేసే ఆర్.డి.టి. కిట్లు, పారాసిట్‌మాల్ మాత్రలను సరఫరా చేశామన్నారు. ఆశా కార్యకర్తలకు ఆర్.డి.టి. కిట్లు సరఫరా చేశామని ఎవరికైనా మలేరియా జ్వరం లక్షణాలు ఉన్నట్లైతే వెంటనే ఆశా కార్యకర్త పరీక్షలు నిర్వహిస్తారన్నారు. డెంగ్యూ జ్వరానికి సంబంధించిన కిట్లు ప్రతి ఎంఎల్‌హెచ్‌పీ దగ్గర అందుబాటులో ఉంటాయని, డెంగ్యూ నిర్ధారణ పరీక్ష పులివెందుల ఏరియా ఆసుపత్రిలో నిర్వహిస్తారన్నారు. దోమల నివారణకు లార్వా నివారణ కొరకు సంబంధించి రసాయనాలు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉంచామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలో ప్రతిఒక్కరికీ లబ్ధి



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : జనం మెచ్చిన జగనన్న ప్రభుత్వంలోనే ప్రతిపేదవాడికి, సామన్యులకు ఎంతో మేలు జరిగిందని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఉమామహేశ్వరస్వామి(బసవన్న కట్ట)ఆలయం వద్ద అమ్మవారిశాల, బ్రాహ్మణవీధి, తదితర ప్రాంతాల్లో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. అనంతరం ప్రతి గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు లేవని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అలాగే కొత్తగా మంజూరైన పింఛన్‌ను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ వరప్ర సాద్, సివిల్ సప్‌లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చంద్రమౌళి, కౌన్సిలర్లు సాయిశైలజ, పుష్ప, ఖాదర్‌బాషా, పార్నపల్లి కిశోర్, ఆలయాల చైర్మన్ నాగేంద్రప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణ పనులకు సహకరించాలి

అభివృద్ధి పనులలో భాగంగా పట్టణంలోని పాత ఆర్టీసీ బస్టాండు ప్రాంతాలలో రోడ్ల విస్తరణ పనులకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలసి ఆయన రోడ్ల విస్తరణ పనులను పరిశీలించారు. ఇంటి యజమానులు నిర్మాణలను వేగవంతంగా తొలగించి రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనులకు సహకరించాలన్నారు.

చదువుతోపాటు క్రీడలు అవసరం



నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయులు

వల్లూరు : విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమని, క్రీడల వలన శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం లభిస్తుందని వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండలస్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బాల బాలికలకు ఖోఖో, కబడ్డీ, త్రో బాల్, వాలీబాల్, టెన్నికాయిట్ ఆటల పోటీలను నిర్వహించారు. మండలంలోని గంగాయపల్లె జడ్పీ హైస్కూల్, ఏపీ మోడల్ స్కూల్, వల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్, కస్తూర్బా బాలికా విద్యాలయం విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేసినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుపాల్‌రెడ్డి తెలిపారు.

నేడు అథ్లెటిక్స్ పోటీలు

ఈ పోటీల్లో భాగంగా గురువారం వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బాల బాలికలకు అథ్లెటిక్స్, యోగా పోటీలను నిర్వహించనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు తెలిపారు.

ఆడపిల్లలు లేకుంటే భవిష్యత్తులో కష్టాలే



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

జమ్మలమడుగు : ఆడపిల్ల పుడుతుందని అబార్షన్లు చేయించుకుంటే భవిష్యత్తు కాలంలో కష్టాలు పడవలసి వస్తుందని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఛాంబర్‌లో బేటి బచావో-బేటి పడావో కార్యక్రమంలో భాగంగా సబ్ డిస్ట్రిక్ లెవల్ మల్టీ మెంబర్ అథారిటీ కమిటీ సమావేశాన్ని ఆర్డీఓ జి.శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ఆడ మగ నిష్పత్తిలో చాలా తేడాలు వస్తున్నాయన్నారు.

ఎఎన్ఎంలు, అంగన్‌వాడీలు క్షేత్రస్థాయిలో గర్భిణుల వివరాలను సేకరించి ఎప్పటి కప్పుడు వారి క్షేమ వివరాలు తెలుసుకోవాలన్నారు. అలాగా స్కానింగ్‌సెంటర్‌ల వద్ద ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వైద్యులు ఆసుపత్రులలో ఆడపిల్లలని అబార్షన్లు చేయకుండా ప్రత్యేక నిఘా పెంచాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.